క్లుప్తంగా

2 వేల మందికి నిత్యావసరాల పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కేఎల్‌రావునగర్ వరద ముంపు ప్రాంతాల్లో శుక్రవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2 వేల మందికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రాజనేని రామానాయుడు ట్రస్ట్ తరుపున శ్రీనివాసులు, శిరీష దంపతులు కేఎల్‌రావునగర్‌లో ఏనుగుల లక్ష్మణరావు వీధి, 1వ లైన్ నుంచి 8వ లైన్ వరకు సరుకు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు నెల రోజులకు అవసరమైన బియ్యం, ఇతర సరుకులు అందచేశారు. తమ సంపాదనలో కొంత భాగాన్ని నిరాశ్రయులైన బాధితులకు అందచేస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. తమతో పాటు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏనుగుల వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ సుకాశి సరిత, సూర్యదేవర హేమంత్, బెవర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉచిత వైద్య శిబిరం



భవానీపురం(విజయవాడపశ్చిమ):వరద బాధితుల కోసం నేషనల్ మెడికల్ అసోసియేషన్ (ఎన్ఎంఎ) ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా యూనిట్, ఆయుర్వేదిక్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వరద ముంపులో ఉన్న కుటుంబాలకు తలెత్తిన ఆరోగ్యపరమైన సమస్యలపై వైద్యులు పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేసి పలు సూచనలు, సలహాలు, జాగ్రత్తలు చెప్పారు. స్థానిక వైద్యులు పమ్మి సూర్యకుమార్ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు పీవీఎస్‌వీ భాస్కర్, వి.భానుప్రకాష్, బి. వెంకట రమణ, జి.చినరాజు, ఎం.జాబిల్లి, విద్యాసాగర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు ఎన్ఎంఎ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని అసోసియేషన్ వైద్యులు చెప్పారు.

ఉచితంగా గ్యాస్‌స్టవ్‌ల మరమ్మతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లల్లో వరద నీరు చేరి పాడైపోయిన వంట గ్యాస్ స్టవ్‌లకు ఉచితంగా మరమ్మతులు నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ ఆదేశాల మేరకు విద్యాధరపురంలోని శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరి బాబు ఆధ్వర్యంలో విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానాలో శుక్రవారం మరమ్మతుల శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీభవానీ గ్యాస్ కంపెనీకి చెందిన గ్యాస్ స్టవ్‌ల మెకానిక్స్, సిబ్బంది పాల్గొని వరద బాధితులు (గ్యాస్ వినియోగదారులు) తీసుకొచ్చిన స్టవ్‌లకు రిపేర్లు చేసి తిరిగి వినియోగంలోకి వచ్చేలా చేసి ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీభవానీ గ్యాస్ కంపెనీ మేనేజర్ నీలిమ, వీ లక్ష్మణరావు, మెకానిక్కులు రవీంద్ర, సాయి, ఆసిఫ్ పాల్గొన్నారు.

కర్వ్ ఎస్‌యువీ కూపే కారు విడుదల



గుణదల(విజయవాడ తూర్పు):టాటా మోటార్స్ ఉత్పాదనల్లో భాగంగా కర్వ్ ఎస్‌యువీ కూపే కారును మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు టాటా మోటార్స్ వెహికల్ రీజనల్ మేనేజర్ గోపు గోపీకృష్ణ అన్నారు. రింగ్ రోడ్డులోని జాస్పర్ ఇండస్ట్రీస్ షోరూమ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లాంఛన ప్రాయంగా నూతన కారను విడుదల చేసి కొనుగోలుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి కుంటుంబాలకు అందుబాటులో ఉండే విధంగా ఎస్‌యువి కారును తయారుచేసినట్లు తెలిపారు. పెట్రోలు, డీజిల్, ఎలక్ట్రిక్ వేరియంట్స్‌లో దీనిని తయారు చేశారని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజి ఇచ్చే విధంగా ఈ కారు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టాటా మోటార్స్ జనరల్ మేనేజర్ హేమంత్ రావు, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

చీరలు, మందుల పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపుతో సర్వం కోల్పోయిన నగరంలోని కబేళా, వించిపేట, నైజాంగేట్, జ్యోతినగర్, వన్ టౌన్ ప్రాంతాల్లో బాధితులకు జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ ఎన్డీఏ కూటమి ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి దుప్పట్లు, చీరలు, మందులు పంపిణీ చేశారు. వరద ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు దుప్పట్లు, ఫ్రూట్స్, బ్రెడ్స్ పంపిణీ చేశారు.

వరద వేదన..



నీటి కోసం.. జక్కంపూడి కాలనీలో ట్యాంకర్ వద్ద వరదలోనే నీరు పట్టుకుంటున్న జనం



ఎదురుచూపులు.. రామకృష్ణాపురంలో సరుకులు తీసుకోవడానికి క్యూలో బాధితులు



నీళ్లివ్వండి బాబూ.. ఊర్మిళానగర్‌లో వరద నీటిలో చిక్కుకున్న వృద్ధురాలు మంచినీటి కోసం వేదన



భయం.. భయం.. వరద మళ్లీ వస్తుందనే ఆందోళనతో తరలి వెళ్తున్న నందమూరినగర్ సాయిబాబా గుడి సెంటర్‌వాసులు



మందులు కావాలి సారూ.. వాంబేకాలనీలో జ్వరంతో బాధపడుతున్న కుమారుడితో తల్లి రాములమ్మ

బుడమేరు వరద ప్రభావానికి నగర ప్రజలు విలవిలలాడుతున్నారు. చుట్టూ జలంతో జనం ఇక్కట్లు పడుతున్నారు. వరద సాయం ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అందకపోవడంతో ముంపు ప్రాంతవాసుల వెతలు అన్నీ ఇన్నీ కావు. తాగడానికి నీళ్లు లేక.. తినడానికి తిండి అందక వేదన చెందుతున్నారు. వృద్ధులు మంచినీళ్ల కోసం అల్లాడుతున్నారు. వరద ముప్పు ఇంకా వెంటాడుతుండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. వరద పెరగడంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. నిత్యావసర వస్తువుల కోసం ప్రజలు బారులు తీరి కనిపించారు. నీటి స్థాయి తగ్గిన ప్రాంతాల్లో వరద కారణంగా ఏర్పడిన బురదను శుభ్రం చేసుకుంటున్నారు. నీట మునిగిన వాహనాలను షెడ్లకు చేరుస్తున్నారు ముంపు బాధితులు. ఈ వెతలు ఎప్పుడు తీరుతాయో ఏంటో అని వాపోతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్స్ విజయవాడ



ఇంకా ముంపులోనే.. ఆరు రోజులుగా వరద నీటిలోనే జక్కంపూడి హైస్కూల్



సురక్షితంగా.. వరద పెరగడంతో కాలనీల నుంచి సింగ్‌నగర్ ఫ్లైఓవర్ పైకి వచ్చిన బాధితులు



దేవుడా.. ఊర్మిళానగర్‌లో దేవాలయం వద్దకు చేరిన జనం



ఎట్టకేలకు అందాయి.. భవానీపురం వెలంపల్లి కాలనీలో రేషన్‌బండి ద్వారా సరుకులు తీసుకుంటున్న బాధితులు



బాగు పడాలి.. ఊర్మిళానగర్‌లో ద్విచక్రవాహనాలకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్



మాకివ్వండి.. వాంబేకాలనీలో ఆహారపొట్లాలు కోసం ముంపు బాధితులు



శుభ్రం చేసుకోవాలి.. వాంబేకాలనీలోని ఓ షాపులో సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న ప్రజలు

మానవత్వం మరిచారా..?



హాస్పటల్‌లో లోపల బెడ్స్‌పై మందుల బాక్స్‌లు, కుక్క



మందుల గదిలో వరద నీరు

- వరద ముంపులో వీఎంసీ ప్రసూతి వైద్యశాల
- కానరాని వైద్యులు, సిబ్బంది
- విద్యాధరపురం లేబర్ కాలనీ ప్రజల ఆవేదన
- వరద నీటిలో మందుల బాక్స్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ):నగరపాలక సంస్థకు చెందిన ప్రజారోగ్య అధికారుల్లో మానవత్వం చచ్చిపోయిందా అనిపిస్తుంది. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ప్రసూతి వైద్యశాల బుడమేరు వరద నీటిలో ముంపునకు గురైన తీరు చూస్తుంటే ప్రజల్లో ఎవరికైనా ఇదే అనుమానం రావడం సహజం. హాస్పిటల్ ఆవరణలోనే కాదు, లోపల కూడా వరద నీటితో నిండిపోయింది. హాస్పిటల్‌లోని బెడ్‌లపై కొన్ని మందుల బాక్స్‌లు పెడితే ఒక కుక్క ఎంచక్కా బెడ్‌పై పడుకుని ఉంది. ప్రసూతి వైద్యశాలలో ఉండాల్సిన వైద్యులుగానీ, సిబ్బంది గానీ కనుచూపు మేరలో కనబడక పోవడం విడ్డూరంగా ఉంది. ఒక వైపు ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు, మరో వైపు బుడమేరు వరద నీటి ముంపులో రోగులకు, బాధితులకు చికిత్స అందించాల్సి ఉండగా తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్న అధికారులు, వైద్య సిబ్బందిపట్ల లేబర్‌కాలనీ, పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముక్కుతూ మూలుగుతూ హాస్పిటల్‌కు వస్తే అక్కడ దృశ్యం చూసి అవాక్కవుతున్నారు.



వరద నీటి ముంపులో విద్యాధరపురం లేబర్‌కాలనీలోని ప్రసూతి వైద్యశాల

వరద నీటిలో మందుల బాక్స్‌లు....

హాస్పిటల్ లోపల పేషెంట్లకు ఇవ్వాల్సిన మందుల బాక్స్‌లు లోపలా బయటా వరద నీటిలో తేలియాడుతుండటం చూస్తుంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం స్పష్టం అవుతుంది. వరద బాధితులకు ప్రైవేట్ వైద్యశాలలకు చెందిన వైద్య సిబ్బంది రోడ్డు మీదకు వచ్చి వైద్యసేవలు అందిస్తుంటే ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మాత్రం అడ్రస్ లేకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మందులు సంగతి దేవుడు ఎరుగు కనీసం సమాధానం చెప్పేవారు కూడా అందుబాటులో లేకపోవడం ఏమిటని మండిపడుతున్నారు.

నొప్పులు వస్తే ఎక్కడికి వెళ్లాలి ?

గర్భిణులకు అర్జంట్‌గా నొప్పులు వస్తే ఎక్కడికి వెళ్లాలని లేబర్‌కాలనీ మహిళలు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లే ఆర్థిక స్తోమత లేక నగర పాలక సంస్థ ప్రసూతి హాస్పిటల్‌కు వెళదామంటే వరద నీటి ముంపులో తలుపులు బార్లా తెరిచి ఉండటంపట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హాస్పిటల్‌లోని ఫార్మసీ, ల్యాబ్, కంప్యూటర్స్ అన్నీ వరద నీటిలో ఉండగా అలా గాలికి వదిలేయటం ప్రభుత్వ వైద్య అధికారులు, సిబ్బందికే చెల్లిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాతబస్తీలో కొలువుదీరిన గణనాథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో భారీ గణనాథులు కొలువుదీరారు. నగరంలో కొంత వరద ప్రభావం ఉన్నప్పటికీ పాతబస్తీలోని చాలా ప్రాంతాల్లో గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివావారం నుంచి ప్రారంభమయ్యే వినాయకచవితి ఉత్సవాలకు వన్‌టౌన్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఏ పండుగను జరుపుకోనంత భారీగా గణనాథుని ఉత్సవాన్ని వన్‌టౌన్‌వాసులు ఘనంగా నిర్వహిస్తారు. తొలి పూజను అందుకునే గణనాథుడు తమకు అన్ని వేళల అండగా ఉండాలని వ్యాపార సంఘాలు, మిత్రబృందాలు, వివిధ సమూహాలు వన్‌టౌన్‌లోని వీధివీధినా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వన్‌టౌన్‌లో అడుగు నుంచి 14 అడుగుల మేర గణనాథుని విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సమ్మెటవారివీధి, కందులవారివీధి, పూలబావివీధి తదితర ప్రాంతాల్లో చూడముచ్చటగా ఉన్న గణనాథులను ఏర్పాటు చేశారు. అలాగే వస్త్రలత, కోమలవిలాస్ సెంటర్ తదితర ప్రాంతాల్లోనూ భారీగానే ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వాటితో పాటుగా కలకత్తా, ముంబాయి ప్రాంత సంప్రదాయాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో తయారైన బొజ్జగణపయ్య విగ్రహాలు వన్‌టౌన్‌లో ఆయా పందిళ్లలో కొలువుదీరాయి. హైదరాబాద్ నుంచి ఇరవై వేల నుంచి లక్ష రూపాయాల మేర వ్యయం చేసి విగ్రహాలనను కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



విగ్రహాన్ని తరలిస్తున్న పాతబస్తీలోని హోల్‌సేల్ వ్యాపార సంఘాలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైంది ఎమ్మెల్యే సార్?

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'ఓడ దాటే వరకు ఓడ మల్లయ్య.. దాటిన తర్వాత బోడి మల్లయ్య' అన్న చందాన ఎన్నికలకు ఇచ్చిన హామీని నెరవేర్చని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి వైఖరిపై సవన్ స్వర్ణశ్రీ టవర్స్‌లో నివసిస్తున్న 90 కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విద్యాధరపురం సితార సెంటర్ (కబేళా రోడ్)కు అతి సమీపంలో మెయిన్ రోడ్ పక్కనే ఉన్నా బుడమేరు వరద ప్రభావంతో తమ అపార్ట్‌మెంట్ వరద నీటిలో తేలియాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నుంచి తమ అపార్ట్‌మెంట్ దారికి 25 మీటర్ల దూరం ఉందని, రోడ్డుపై మూడు అడుగుల నీళ్లు ఉంటే అపార్ట్‌మెంట్‌లో ఐదు అడుగులు ఉంటుందని చెబుతున్నారు. మధ్యలో ఉన్న రోడ్డు రెండు అడుగుల లోతులో ఉండటమే కారణమని తెలిపారు. మొన్న ఎన్నికల సమయంలో రోడ్డుకు అపార్ట్‌మెంట్‌కు మధ్య ఉన్న 25 మీటర్ల మేర రోడ్డు వేస్తామని వాగ్దానం చేసి తిరిగి ఇటు వైపు తొంగి చూడలేదని వాపోతున్నారు. ఇచ్చిన హామీ మేరకు చిన్నపాటి రోడ్డు వేసి ఉంటే ఈ రోజు ఈ దుస్థితి ఉండేది కాదని అంటున్నారు. రోడ్డు మీద నీళ్లు తగ్గినా అపార్ట్‌మెంట్‌లో తగ్గడం లేదని, అందుకు కారణం 25 మీటర్ల రోడ్డేనని స్పష్టం చేస్తున్నారు.



అపార్ట్‌మెంట్‌లో నిలిచిన వరద నీరు

పూజా సామగ్రికి పెరిగిన గిరాకీ

- జోరుగా పత్రి, పండ్లు, గణేష్ విగ్రహాల విక్రయాలు
- రద్దీగా కనిపించిన మార్కెట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని నగరంలో మార్కెట్లు శుక్రవారం సందడిగా కనిపించాయి. వన్‌టౌన్‌లోని చవితి వేడుకల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో గణపతి బొమ్మలు, పూజా సామగ్రి విక్రయాలతో మార్కెట్లు కిటకిటలాడుతూ దర్శనమిస్తున్నాయి. సాధారణంగా పండుగ ముందు రోజు సాయంత్రం సందడిగా మార్కెట్లు దర్శనమిస్తాయి. కానీ గతంతో పోల్చి చూస్తే గ్రామాల నుంచి వచ్చే చిరు వ్యాపారులు నామమాత్రంగా నగరానికి వచ్చారు. అయినా నగరంలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. గణపతి పూజకు అవసరమయ్యే పత్రి, వివిధ రకాల పూజా సామగ్రి, వినాయకుని విగ్రహాలు, మట్టి విగ్రహాల తయారీదారులు, గొడుగులు, పండ్ల వ్యాపారులు భారీగా తమ విక్రయాలు సాగించారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ వ్యాపారులతో పూర్తిగా నిండిపోయింది. హెడ్‌పోస్టాఫీస్, వస్త్రలత, కాళేశ్వరరావు మార్కెట్ కాంప్లెక్స్ భవనాల చుట్టూ రద్దీ కనిపించింది. శివాలయం వీధి, కొత్తపేటలోని గణపతి రావురోడ్డు తదితర ప్రాంతాలు సైతం సందడిగా కనిపించాయి. పూజా సామగ్రి మొత్తం వంద నుంచి రూ.200 వెచ్చిస్తే గతంలో సరిపోయేది. ప్రస్తుతం రూ.400పైనే ఖర్చు చేయాల్సి వస్తుంది.



పాతబస్తీ మొయిన్‌బజార్‌లో విక్రయానికి సిద్ధంగా గణపతి విగ్రహాలు



కేజీ మార్కెట్ వద్ద పూజా సామగ్రి విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

ప్రతి ఒక్కరికీ ఆహారం అందాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఆహారం అందడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలకు జరిగే ఆహార పంపిణీ వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మొగల్రాజపురంలోని పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో యాపిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, నూడిల్స్ ప్యాకెట్లను, ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది, వలంటీర్లను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, గంటకు గంటకూ బ్లీచింగ్ వేస్తూ ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ఉండేటట్టు చూసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సున్నంబట్టీల సెంటర్ నుంచి గుణదల వరకు వెళ్లే రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. బీఆర్టీఎస్ రోడ్డులో నిలిపిన నిత్యావసరాల పంపిణీ వాహనాలు ఆయన పరిశీలించారు. ప్రతి సచివాలయ పరిధిలో వాహనాల సాయంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వరదలకు నిరాశ్రయులైన ప్రజలకు స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉండాలని వేముల చారిటీస్ చైర్మన్ వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. జేవీఆర్ ఫౌండేషన్ కన్వీనర్ జేవీ రెడ్డి, వేముల చారిటీస్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని అన్నపూర్ణాదేవి నగర పాలక సంస్థ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు దుప్పట్లు పంపిణీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వరదలు నగరాన్ని మరింత దారుణంగా దెబ్బతీశాయన్నారు. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయుల య్యారని చెప్పారు. అటువంటి వారందరికీ అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సాయమందించాలని కోరారు. కార్యక్రమంలో పి. తిరుమలరావు, జేవీఎస్ కేరెడ్డి, జి.హరి, ఈవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

